క్లుప్తంగా



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి, ఆయన సతీమణి కళావతి, కార్పొరేటర్ తోట పద్మావతి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, ఇతర నాయకులు శ్రీకన్య థియేటర్ దరి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు సహకారం అందించారు.
సీతమ్మధార

సమస్యల సాధనకు ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నేడు అయిదో రోజుకు చేరుకుంది. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఈ కార్య క్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల సాధనకు పోరాటం సాగిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు లోకేశ్వరరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతుబజార్ స్టాళ్లకు డ్రా తీస్తున్న అధికారి

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లో స్టాళ్లకు సోమవారం డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఉదయం 12 గంటలకు రైతుబజార్ ఎస్టేట్ అధికారి వరలక్ష్మి సమక్షంలో ఈ డ్రా తీశారు. తమకు కేటాయించిన స్టాళ్లలో రైతులు బుధవారం నుంచి విక్రయాలు జరపనున్నారు. మంగళవారం రైతుబజార్‌కు సెలవు. ప్రతి సోమవారం డ్రా తీసి రైతులకు స్టాళ్ల కేటాయింపు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి తెలిపారు.



ప్రేమసమాజంలో ఓటు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ దంపతులు



ప్రసాద్‌గార్డెన్స్‌లోని 255 బూత్ ఓటర్లకు స్లిప్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఓటర్ల సహాయ కేంద్రంలో ద్రోణంరాజు శ్రీవత్సవ్



ఏవీఎన్ కాలేజీ బూత్ వద్ద పార్టీ నాయకులతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

పోలింగ్ ప్రశాంతం

- పలు చోట్ల పొద్దుపోయే వరకు ఓటింగ్
- బారులుతీరిన పట్టభద్రులు
- పటిష్ట బందోబస్తు.. 144 సెక్షన్ అమలు

దాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు పోలింగ్ జరిగింది. అయితే సాయంత్రం 4 గంటలకే గేట్లు మూసివేశారు. అప్పటి వరకు క్యూలైన్లలో ఉన్న ప్రతి ఓటరుకు ఓటు వేసే అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్, సతీమణి దండుబజార్ సమీపాన గల ఎంవీడీ హైస్కూల్లో (బూత్ నెంబరు 251లో) ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ దంపతులు ప్రేమసమాజం అప్పర్‌ప్రైమరీ స్కూల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామకృష్ణమిషన్ హైస్కూల్లో (బూత్ నంబర్లు 249, 250) సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ సాగింది. 251, 252లో సాయంత్రం 5.30 గంటల వరకు పోలింగ్ సాగింది. ఏవీఎన్ కళాశాలలో గల 253, 254 పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. ప్రేమసమాజం అప్పర్ ప్రైమరీ స్కూల్లో (256, 257 పోలింగ్‌బూత్‌లు) సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. కేఎస్ఎం గరల్స్ హైస్కూల్ (258, 259, 260, 261 పోలింగ్ బూత్)లో సాయంత్రం వరకు క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరారు. రైల్వేన్యూ కాలనీ జీవీఎంసీ హైస్కూల్లో (బూత్ నెంబరు 262) సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది.

ప్రసాద్‌గార్డెన్స్‌లో..

జగదాంబ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం దక్షిణ నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రసాద్‌గార్డెన్స్‌లోని గణేశ్వర పాఠశాలలో ఏర్పాటు చేసిన 255 బూత్‌కు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఓటర్ స్లిప్‌లను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పట్టభద్రులకు అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం మందకొడిగా ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి పోలింగ్ ఊపందుకుంది.

ప్రేమసమాజంలో..

అల్లిపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికలలకు సంబంధించి 255 నంబరు బూత్‌లో 831 మంది ఓటర్లు ఉండగా 555 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 256లో 1300 మంది ఓటర్లు ఉండగా 779 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 257లో 979 మంది ఓటర్లు ఉండగా వారిలో 663 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేసారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల దూరంలోనే వాహనాల రాకపోకలను నియంత్రించారు. పోలింగ్ బూత్ వద్ద జనాలు గుంపులు, గుంపులుగా మూగకుండా చర్యలు తీసుకున్నారు. ఓటర్లకు సహకరించేందుకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సందర్శించి ఓటర్లకు స్లిప్పులు అందజేశారు. ఆయన వెంకట కార్పొరేటర్లు తోట పద్మావతి, జైన్, 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, బొడ్డేటి ప్రసాద్, బొర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



ఓటు వేసి వస్తున్న రూపాకుల రవికుమార్ తదితరులు

పోలింగ్ బూత్‌ను సందర్శించిన శ్రీవత్సవ్

అల్లిపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రేమసమాజం వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ల సహాయ కేంద్రాన్ని ద్రోణంరాజు శ్రీవత్సవ్ సోమవారం ఉదయం సందర్శించారు. ఆయన వెంట 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపి, బొడ్డేటి ప్రసాద్, కర్రి నీలకంఠం, దొడ్డి బాపుఆనంద్, వై.చిన్నమ్మలు, శ్రీను, పోలవరపు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ సరళిపై పంచకర్ల ఆరా

మహారాణిపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సోమవారం దక్షిణంలోని ఏవీఎన్ కాలేజీ వద్ద 253, 254 బూత్‌ల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, కార్పొరేటర్ జానకీరామ్, పార్టీ నాయకులు డేవిడ్ రాజు, కార్యకర్తలతో చర్చించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఇతర పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.

ఎంవీడీ హైస్కూల్లో..

మహారాణిపేట : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 29వ వార్డు దండుబజార్ ఎంవీడీ హైస్కూల్లో బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయనతో పాటు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.



ప్రేమసమాజం బూత్ వద్ద ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో కార్పొరేటర్లు జైన్, పద్మావతి తదితరులు



దండుబజార్ ఎంవీడీ హైస్కూల్లో ఓటు వేసేందుకు సతీసమేతంగా క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

మానవ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మానవ హక్కులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తాము నిరంతం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు.



మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన గణాంకాలను చూపుతున్న శ్యాంప్రసాద్

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

రహదారిపై వ్యర్థాలు తొలగించండి

జగదాంబ: రహదారులపై వ్యర్థాలు తొలగించాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. సోమవారం జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన సూర్యాబాగ్ వద్ద రహదారిపై ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపజేశారు. ప్రజా మరుగుదొడ్ల వద్ద ముగ్గులు వేసి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.సుధాకర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాబాగ్‌లో చెట్లకొమ్మలను తొలగింపజేస్తున్న జెడ్సీ శివప్రసాద్

మహిళా దినోత్సవ సందడి



వేడుకలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఆటపాటలతో సందడి చేశారు. సంస్థ అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు కరోకి ట్రాక్ సాంగ్స్ ఆలపించి అలరించారు. మహిళలు ప్రతిభా ప్రదర్శనలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వేడుకల్లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రా ఆర్టిస్ట్స్ డైరెక్టర్ సన్‌మూర్తి, గాయకులు వి.రామ్ కుమార్, బాలాజీ, ధనలక్ష్మి, సాత్విక, రేణుక, రవిచంద్ర, గీత, లక్ష్మి, స్వరూప, కవిత పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని వైద్య సేవలు
- అందుబాటులోకి రక్త పరీక్షలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 18 రకాల రక్త పరీక్షలు, 55 రకాల ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంచరపాలెం ఆర్పీ పేట, జ్ఞానాపురం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వైద్య పరీక్షలకు అదనంగా మరో 8 రకాల పరీక్షలను ప్రభుత్వం ప్రజల ముందుకు తెచ్చింది.

24 గంటల్లో ఫలితాలు : కంచరపాలెం పీహెచ్‌సీకి ప్రతి రోజు 80 నుంచి 140 మంది వరకు రోగులు వస్తుంటారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్లు, రక్త పరీక్షలకు కావాల్సిన ల్యాబ్ సామగ్రిని అందుబాటులో ఉంచారు. రోగులకు సంబంధించి రక్త నమూనాలను సిబ్బంది సేకరించి 24 గంటల్లో ఫలితాలను తెలియజేస్తారు. ఈ పరీక్షల వల్ల రోగికి నగదు ఆదా అవడమే కాకుండా శ్రమ కూడా తగ్గుతుంది.



ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ శశిప్రియాంక

రక్త పరీక్షల వివరాలు..

- టీఎస్‌సీ (తెల్ల రక్త కణాల లెక్కింపు)
- డీఎస్‌సీ (ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష)
- ప్లేట్‌లెట్స్ కౌంట్
- ఎస్.బైలురూబిన్ (కామెర్లు)
- ఆర్‌పీఆర్
- డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్
- స్టూల్ ఫర్ ఓవా అండ్‌సిస్ట్ (విరేచనాలకు సంబంధించి)
- టీబీ అండ్ డాట్స్ (క్షయకు సంబంధించి పరీక్షలు)

రైతుబజార్లను పరిశుభ్రంగా ఉంచాలి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. డ్వాక్రా స్టాళ్లలో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.



రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

నమో శివరుద్రాయ

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమపూజలు నిర్వహించారు. శివ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం

బీచ్ రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అవసరమని జోన్–1 ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దవాల్తేరులోని సన్ ఫ్లవర్ స్పెషల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, అనాథలకు మంచి విద్యను అందించేందుకు కొన్నేళ్లుగా కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.

760వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 760వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు.



760వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

నేడు పోలిపిల్లమ్మ వార్షిక పండగ

- విశేషంగా ఏర్పాట్లు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి అప్పన్నపాలెం వాసుల ఆరాధ్య దేవత పోలిపిల్లమ్మ తల్లి వార్షిక పండగను మంగళవారం విశేషంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్స వాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా భారీ ఎత్తున కాల్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉరివిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నూనెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

